## జిల్లా కో ఆర్డినేటర్‌గా నియామకం



మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా కోఆర్డినేటర్‌గా మాడ్గులపల్లికి చెందిన అప్పల మధును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

## ఆగని బస్సులు.. ప్రయాణికుల ఇక్కట్లు

సొంత గ్రామాల్లో దసరా పండుగ జరుపుకొనేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన వారు ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో బస్సుల్లో ప్రయాణికులతో కిక్కిరిసి ప్రయాణం సాగించారు. హైదరాబాద్ వైపునకు వెళ్లేందుకు కట్టంగూరులో బస్సులు నిలపక పోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో తప్పని పరిస్థితుల్లో ప్రమాదకరంగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

- కట్టంగూరు, న్యూస్‌టుడే:



హైదరాబాద్ వైపు వెళ్లేందుకు బస్సు కోసం కట్టంగూరులో ఎదురు చూస్తున్న ప్రయాణికులు

# ఉత్కంఠకు తెర



హుజూర్‌నగర్: మిల్లుల్లో ధాన్యం దిగుమతికి వేచి ఉన్న ట్రాక్టర్లు (పాతచిత్రం)

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

మిల్లర్లు తమ డిమాండ్లు తీర్చాలని పట్టుబడుతున్న క్రమంలో.. కోతలు ప్రారంభం కాగానే ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళనకు తెర పడింది. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌కి వస్తే పరిస్థితి గందరగోళంగా మారుతుందని అటు అధికారులు, రైతులు కొంతమేర ఆందోళనగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### చర్చల దశలో మిల్లర్ల సమస్యలు..

రాష్ట్ర సబ్ కమిటీ ముందు మిల్లర్లు పలు సమస్యలు ఉంచారు. సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు 67 శాతం బియ్యం రావని, 58 శాతం బియ్యం, 9 శాతం నూకలు ఇస్తామని, తేమ శాతం 14 శాతం మార్చాలని అడుగుతున్నారు. 32 రకాల ధాన్యాన్ని సన్న రకాలుగా గుర్తించాలని, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవి చర్చల దశలో ఉన్నాయి.

★ వీటిపై నిర్ణయం రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకుండా కొనుగోలు చేసిన ధాన్యం గోదాముల్లో నిల్వ చేసి చర్చలు ముగిసిన తరువాత మిల్లులకు కేటాయించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం, 10,69,029 మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యంతో ఇబ్బంది లేకపోయినా సన్నరకాల ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు గోదాముల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం గోదాముల్లో నిల్వ చేసిన నిబంధనల ప్రకారం గడువు అయి పోయిన వారిని వెంటనే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### గోదాముల పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల గోదాములు కలిపి 59 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా అధికారులు సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్ర అధికారులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,49,359 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండగా.. అందులో 6,51,685 మెట్రిక్ టన్నుల మేర గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. కేవలం 2,97,674 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఖాళీగా ఉంది. అధికారులు ఇప్పుడు పాత నిల్వలను ఖాళీ చేయించుకుంటేనే ప్రభుత్వ ఆలోచన ప్రకారం నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా గోదాము ఉపయోగంలో ఉన్నందున దాన్ని ఖాళీ చేయించుకునేందుకు అధికారులు కసరత్తు చేయాల్సి ఉంది.

**ఉమ్మడి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక అంచనాలు ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)**

| జిల్లా | సన్న రకం | దొడ్డు రకం | మొత్తం |
|---|---|---|---|
| నల్గొండ | 2,80,000 | 4,70,000 | 7,50,000 |
| సూర్యాపేట | 1,71,197 | 1,99,029 | 3,70,226 |
| యాదాద్రి | 32,363 | 4,00,000 | 4,32,363 |

**ఉమ్మడి జిల్లాలో గోదాముల వివరాలు, సామర్థ్యం (మెట్రిక్ టన్నుల్లో)**

| జిల్లా | గోదాముల సంఖ్య | సామర్థ్యం | ఉన్న నిల్వలు | ఖాళీ సామర్థ్యం |
|---|---|---|---|---|
| నల్గొండ | 31 | 5,35,223 | 4,55,219 | 80,014 |
| సూర్యాపేట | 15 | 2,86,136 | 83,466 | 2,02,670 |
| యాదాద్రి | 13 | 1,28,000 | 1,13,000 | 15,000 |

# అడవిలో జలకళ



అడవిలో నిండిన చెక్‌డ్యామ్

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గత నెలలో జిల్లాలో ఎగువన కురిసిన వర్షాలు వరదగా మారి అడవుల్లోని చెక్‌డ్యాంలు, పర్క్యులేషన్ ట్యాంకుల్లోకి నీరు చేరుతోంది. వీటిలో కొన్ని పూర్తి జలకళను సంతరించుకుంటే, మరి కొన్ని మోస్తరు నీటితో ఉన్నాయి. దీంతో వన్యప్రాణులకు ఎద్దడి కష్టాలు తీరనున్నాయి. దీనికి తోడు కురిసిన వర్షాలకు అడవులు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. వాటికి అవసరమైన మేత లభించడంతో అక్కడే తిష్ట వేస్తున్నాయి. గడిచిన వేసవిలో పరిస్థితులు భిన్నంగా ఉండేవి. ఎద్దడి తలెత్తడంతో కొన్ని వన్య ప్రాణులు గ్రామాల సమీపంలోని తాగు నీటికి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాయి. కొన్ని వేటగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు అడవుల మధ్యలో ప్రవహించే కాలువలు, వాగులను ఆధారం చేసుకుని చెక్‌డ్యాంలు, కుంటలు నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వనరుల్లోకి నీరు వచ్చి చేరింది. అడవుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో అధికారులు గతేడాది 4 లక్షల వివిధ రకాల మొక్కలు నాటారు. వీటికి సమీపంలోనే కాంటూరు కందకాలు తవ్వించారు. తాజాగా కురిసిన వర్షాలకు నీరు గుంతల్లో చేరింది. సమీపంలోనే ఉన్న మొక్కలకు ఈ నీరే జీవం పోసింది. ప్రస్తుతం మొక్కలన్నీ ఏపుగా పెరుగుతున్నాయి.

### వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా..

– పి.రాజశేఖర్.పి
జిల్లా అటవిశాఖ అధికారి నల్గొండ



వేసవిలో ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేకంగా సాసర్‌పిట్లను నిర్మించాం. ఫిబ్రవరి నుంచే ట్యాంకర్లతో నీళ్లు నింపడంతో వన్య ప్రాణులు దాహం తీర్చుకున్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు అవి కూడా పూర్తిగా నిండాయి. అడవుల అభివృద్ధికి, ప్రాణుల దాహం తీర్చుకోవడానికి పలు రకాల నిర్మాణాలు చేపట్టాం. భూగర్భ జలాలు పెరగడానికి వివిధ రకాల నిర్మాణాలు చేపట్టాం. దీంతో అడవుల్లో జలకళ సంతరించుకుంది.

**జిల్లాలో వివరాలు..**

| | |
|---|---|
| జిల్లా అటవీ విస్తీర్ణం | 65030.14 హెక్టార్లు |
| సెక్షన్లు | 21 |
| బీట్లు | 80 |
| నిర్మించిన చెక్ డ్యాంలు | 162 |
| పర్క్యులేషన్ ట్యాంకులు | 188 |
| భూగర్భ జలాలు పెరగడం కోసం నిర్మించిన రాక్ ఫిల్ డ్యాంలు | 408 |
| ఇంకుడు గుంతలు | 1,27,167 |
| గతేడాది నాటిన మొక్కలు | 4 లక్షలు |

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను నేడు ప్రారంభించండి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలో గుర్తించిన 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంపై ఆదివారం జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌరసరఫరాలు, వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మొదటి విడతలో 325 కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులతో పాటు అవసరమైన టార్పాలిన్లు, కాంటాలు, తేమ కొలిచే యంత్రాలు, రైతులు వేచి ఉండేందుకు షామియానాలు, కుర్చీలు, తాగునీరు, విద్యుత్తు సరఫరా వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవోలు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అన్ని చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. నల్గొండలోని ఆర్జాల బావి వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 100 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీపీఎంలు, ఏపీఎంలు, సహకారశాఖ అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్లు, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉర్సుకు అన్ని ఏర్పాట్లు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి లతీఫ్ షా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శానిటేషన్, లైట్లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నవీన్‌గౌడ్, ఇబ్రహీమ్, సయ్యద్ మసద్, ఉర్సు కమిటీ సభ్యులు ఇంతియాజ్ హుసేన్, చాంద్, జియా, సయ్యద్ ఇర్ఫాన్, సయ్యద్ సముల్లా ఖాద్రీ, సయ్యద్ గౌస్ ఉల్లా ఖాద్రీ, సల్మాన్ ఖాద్రీ, ఉబేద్ ఖాద్రీ, తబరేజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిది చీరలు.. రూ.21 లక్షలు



కొండమల్లేపల్లి: దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న త్రీస్టార్ పేపర్ ప్లేట్స్ కంపెనీ ఎండీ వరికుప్పల శేఖర్

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక సాగర్ రోడ్డులో త్రీస్టార్ పేపర్ ప్లేట్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాన్ని ఆదివారం అత్యంత వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా మాతకు తొమ్మిది రోజులు అలంకరించిన తొమ్మిది చీరలు, లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా రూ.21 లక్షలు ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నారులు, యువతులు, మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూజారులు భాస్కరశర్మ, అశోక్, కమిటీ సభ్యులు శేఖర్, బాబు, ఆంజనేయులు, ఇద్దీ రాములు, ఈదయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**చండూరు:** మండల పరిధిలోని గొల్లగూడేంలో రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారి పట్టు వస్త్రాలు ఆదివారం వేలం పాట నిర్వహించారు. ఎక్కువ మొత్తంలో పోటి పడగా నరాముల నగేష్ యాదవ్ రూ.1.20 లక్షలకు సొంతం చేసుకున్నారు.

**2.17లక్షలు పలికిన అమ్మవారి ముక్కుపుడక.. చింతపల్లి:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి దేవాలయం (శివాలయం)లో ప్రతిష్ఠించిన దుర్గామాత ముక్కుపుడకను మండల కేంద్రానికి చెందిన చెట్టిమళ్ల ప్రశాంత్ రూ.2.17 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. దుర్గామాత శోభాయాత్రలో భాగంగా అమ్మవారి చీరలను, ముక్కు పుడకకు నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. ముక్కుపుడకను అత్యధికంగా రూ.2.17 లక్షలకు ప్రశాంత్ దక్కించుకున్నారు.

**రూ.5,05,116లకు లడ్డూ.. దేవరకొండ:** దేవరకొండలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం గాంధీ బజార్‌లో అమ్మవారి లడ్డు ప్రసాదం వేలం పాట నిర్వహించారు. మొదటి లడ్డు రూ.5,05,116 సాయి బాలాజీ వేరు శనగ మిల్లు భాగస్వామి కర్నాటి పురుషోత్తం దక్కించుకోగా, రెండో లడ్డు రూ.4,01,116 తవిడిశెట్టి నరేష్, స్వాతి దంపతులు దక్కించుకున్నారు. కలశం రూ.2,02,516లకు కొండమల్లేపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి జూలూరు సురేష్, భాగ్యలక్ష్మి దంపతులు దక్కించుకున్నారు.

**రూ.2.30 లక్షలు.. చిట్యాల గ్రామీణం:** చిట్యాల మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపం వద్ద నవరాత్రి ఉత్సవాల అనంతరం ఆదివారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన అరూరి గోపాల్ రూ.2.30 లక్షలకు వేలంలో పాల్గొని అమ్మవారి లడ్డూ స్వాధీనం చేసుకున్నారు.

# చిగురిస్తున్న ఆశలు

◆ రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయనున్న సర్కారు

ఆలేరు, న్యూస్‌టుడే:

సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాలలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వ్యవసాయ రంగంలోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. సాగులో దున్నడం మొదలు పంటనూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. రాయితీపై వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



### ఏటా రూ.600 కోట్లు ఖర్చునకు సిద్ధం

వ్యవసాయశాఖ పరంగా ఇప్పటికే రైతు బంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఇందులో ఉమ్మడి నల్గొండ జిల్లాకు ఏటా రూ.60 కోట్లకు పైగా నిధుల కేటాయింపు జరగనుంది. రోటోవేటర్లు, మూడుకాళ్ల నాగళ్లు, అఫ్‌కేజీ చక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు లాంటివి రాయితీపై అందనున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో రైతులు, వ్యవసాయ విస్తీర్ణం..**

| జిల్లా | రైతులు | విస్తీర్ణంలో(ఎకరాల్లో) |
|---|---|---|
| నల్గొండ | 4,21,278 | 9,82,192 |
| సూర్యాపేట | 3,30,326 | 7,26,482 |
| యాదాద్రి | 1,57,206 | 6,65,000 |

### తప్పనున్న కొనుగోలు 'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచార లోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.

## నేటి నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ చేపడుతున్నట్లు ఆ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. కళాశాలల భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని గుర్తు చేశారు. కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా అమ్మవారి శోభాయాత్ర

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ముగింపు ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ కాలనీల్లోని ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లోని విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో మహిళలు కోలాటం, భజనలు వేస్తూ ఆడిపాడారు. యువతీయువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో ఆకర్షణగా నిలిచారు.



నల్గొండ ఆర్టీసీ కాలనీలో అమ్మవారి శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న భక్తులు



## దనుజహారిణికి దశమి పూజలు..

# దశకంఠుడికి దహన వేడుకలు

- న్యూస్‌టుడే, బృందం



దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శమీ పూజ కార్యక్రమానికి హాజరైన భక్తులు



నకిరేకల్‌లో దసరా వేడుకల్లో నృత్యం చేస్తున్న మహిళలు

నల్గొండ జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు మండలాలు, గ్రామాల్లో అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజులు భక్తులు అమ్మవారి సేవలో నిమఘ్నమై.. తనివితీర పూజించుకున్నారు. వేలాది మంది భక్తులు పలు ఆలయాల్లో జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహించి.. జమ్మి ఆకును తీసుకుని పాలపిట్టను చూసి తరించారు. జమ్మి ఆకును తమ బంధు, మిత్రులకు పంచి పండగ శుభాకాంక్షలు తెలియపరుచుకున్నారు. అనంతరం రావణదహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జయప్రదమైన.. ఆలోచన



చౌటుప్పల్, న్యూస్‌టుడే: మహిళలు ముక్కువతో కొనుగోలు చేసి, ఇష్టంగా ధరించే ఖరీదైన చీరలు, రవికల అందం, ఆకర్షణ తగ్గకుండా సంరక్షించడాన్ని స్వయం ఉపాధిగా ఎంచుకున్నారు అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్ల జయప్రద. ఈమె మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు. 2002లో గ్రామంలోని పది మంది మహిళలతో కలిసి శ్రీలక్ష్మి-1 పొదుపు సంఘం సభ్యురాలిగా చేరారు. సంఘం సమావేశాల్లో కేవలం పొదుపు చేయడం గురించే కాకుండా మద్యనిషేధం, భావిపౌరుల సంక్షేమం, వనాల పెంపకం, జల సంరక్షణ అంశాలపై చర్చించేవారు. పొదుపు సొమ్మును, బ్యాంకు నుంచి రుణ సహాయాన్ని కలిపి తమ కుటుంబ సంక్షేమానికి, ఆదాయ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. సంఘం ఇచ్చిన చైతన్యంతో సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధితోపాటు కొందరికి పని కల్పించాలని ఆలోచించారు.

★ చీరలు, రవికలు, వివిధ రకాల వస్త్రాలను ఆధునిక పద్ధతిలో శుభ్రం చేయడం, కొత్తవాటిలా మెరిసేలా పాలిషింగ్ చేయడం, మరకలను తొలగించడం, డ్రైక్లీనింగ్ లాంటి వస్త్ర సంరక్షణ పనులు చేయడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. తన వ్యాపార ఆలోచనను స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులకు వివరించడంతో వారు ప్రోత్సహిస్తూ రూ.4లక్షల రుణాన్ని మంజూరు చేశారు. ఆ డబ్బుతో యంత్రాలను కొనుగోలు చేసి 'శ్రీదత్త శారీ కేర్ సెంటర్'ను చౌటుప్పల్‌లో ప్రారంభించారు. తనతోపాటు మరో మహిళకు ఉపాధి కల్పించారు.

### వస్త్రాలు మహిళల గౌరవాన్ని పెంచుతాయి

– నల్ల జయప్రద, శ్రీదత్త శారీ కేర్ సెంటర్ నిర్వాహకురాలు



మహిళలు, పురుషులు తమ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకునేలా ఆధునికమైన, ఖరీదైన వస్త్రాలను ధరిస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాలకు విలువైన పట్టుచీరలు, నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వాటిని ధరించిన తర్వాత ఆధునిక పద్ధతుల్లో శుభ్రం చేయాల్సి ఉంటుంది. మరకలు పడితే, వాటికున్న వెండి జరి, అలంకరణ రంగు మారి, మాసిపోయినట్టు అవుతుంది. వాటిని కొత్త వాటిలా తయారు చేయకపోతే వన్నె తగ్గుతుంది. ఈ పనులు చేయడం ద్వారా పరోక్షంగా మహిళలకు ఉపయోగపడవచ్చు. ప్రత్యక్షంగా ఉపాధి పొందవచ్చునని ఆలోచించి ఈ సెంటర్‌ను ప్రారంభించాను.


### ఉపాధి పొందుతున్నా..

– జె.సంధ్య, బీఎస్సీ పట్టభద్రురాలు, చౌటుప్పల్



బీఎస్సీ చదివా. ఇంటి వద్ద ఖాళీగా ఉండేదాన్ని. కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఏదైనా ఉద్యోగం చేయాలని అనుకుంటున్న సమయంలో ఈ సెంటర్‌లో సహాయకురాలిగా పని చేసేందుకు అవకాశం దొరికింది. ఇంటి పనులయ్యాక తీరిక సమయంలో ఇక్కడికొస్తున్నా. పని నేర్చుకుంటూ నిర్వాహకురాలికి సహాయ పడుతున్నా. ఇది గౌరవ ప్రదంగా నిర్వహించే స్వయం ఉపాధి. భవిష్యత్తులో ఈ అనుభవం ఉపయోగపడుతుంది.

# గడపకో.. ఉద్యోగి..!



మిర్యాలగూడలోని వినోభానగర్

◆ 300 కుటుంబాల్లో 250 మందికి పైగా ఉద్యోగులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఊరు పుట్టినప్పటి నుంచి ఉన్న ఆ వీధిలో ఒకప్పుడు కూలీలు, తాపీ పని చేసే వారు మాత్రమే ఉండేవారు. పలువురికి వ్యవసాయ భూములున్నప్పటికీ సాగు చేసేందుకు నీటి సదుపాయం లేక కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. అత్యధికులు తాపీపని నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించేవారు. కాలక్రమంలో వ్యవసాయాన్ని వృద్ధి చేసుకున్నారు. తాపీ కూలీలు.. మేస్త్రీలుగా మారారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడం మొదలుపెట్టారు. పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినోబా బావే పేరుతో ఏర్పడిన ప్రస్తుత 36వ వార్డులోని వినోబా నగర్ నేడు విద్యాధికుల కాలనీగా మారింది. 2005 నుంచి ఉన్నత చదువులు చదువుతున్న వారి సంఖ్య పెరగడంతో ఉద్యోగుల సంఖ్య సైతం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 300 కుటుంబాలున్న ఆ కాలనీలో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, మరో వంద మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.

### అటు ఉద్యోగం.. ఇటు వ్యవసాయం

ఈ కాలనీకి చెందిన ఇద్దరు పోలీస్ శాఖలో సీఐలుగా, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులుగా పనిచేస్తున్నారు. ఐదుగురు డాక్టర్లు, 30 మంది ఉపాధ్యాయులు, పరిశ్రమల శాఖలో ఒకరు, డీసీటీవోలో ఒకరు, వ్యవసాయ శాఖ ఏడీ ఒకరు, విద్యుత్తు ఏడీఈ ఒకరు, నీటి పారుదల శాఖలో ఇద్దరు ఏఈలు, మరో ముగ్గురు ఉద్యోగులు, నర్సులు ఐదుగురు, పంచాయతీ కార్యదర్శులు ఐదుగురు, వివిధ శాఖల్లో సీనియర్, జూనియర్ సహాయకులు పది మంది, అటెండర్లు 20 మంది ఉన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20 మంది పనిచేస్తున్నారు. మరో 80 మంది వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 250 మందికి పైగా ఉద్యోగులు ఉండగా.. వీరిలో పలువురు విధుల అనంతరం వ్యవసాయం చేస్తున్నారు.

### తాపీ పనిచేస్తూ చదివించారు..

– కోడిరెక్క రవికుమార్, విద్యుత్తు ఏడీఈ, మిర్యాలగూడ



అమ్మానాన్నలు కోడిరెక్క దోర్నీసు, సుక్కమ్మలు. నాన్న తాపీ పని చేస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. ఎంటెక్ పూర్తి చేసి విద్యుత్తు శాఖలో ఏడీఈగా పని చేస్తున్నా. మా పెద్ద చెల్లి రాధ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చిన్న చెల్లి వినయరాణి హైదరాబాద్‌లో డాక్టర్, తమ్ముడు వినోద్ కెనడాలో దంత వైద్యుడిగా పని చేస్తున్నారు. అమ్మానాన్న చదువు విలువ తెలుసుకుని ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు.

### ఇంటికి ఇద్దరు పట్టభద్రులే

– కోడిరెక్క శైలజ, పంచాయతీ కార్యదర్శి, తక్కెళ్లపాడు, మిర్యాలగూడ మండలం



నాన్న కోడిరెక్క మల్లయ్య తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే మాకు ఏ లోటు రాకుండా ఉన్నత చదువులు చదివించారు. ఎం.ఫార్మసీ పూర్తి చేసి 2019 నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. సోదరి వసంత పట్టణంలోనే వైద్యురాలు. సోదరుడు నాగేందర్ డీసీటీవోగా పని చేస్తున్నారు. చదువు విలువ తెలుసుకున్న తలిదండ్రులు మేము ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించారు. మా కాలనీలో ఇంటికి ఇద్దరు పట్టభద్రులు, ఇంటికొక్కరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

# ముత్యాలమ్మ కొడుకు.. ఆణిముత్యమై..!

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో నలుగురితో గౌరవం పొంది, ఉన్నతంగా జీవించాలనే లక్ష్యానికి అనుగుణంగా కష్టాలకు ఎదురొడ్డి.. అన్నీ.. తానై పెంచిన అమ్మ కోసం మిర్యాలగూడ మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ.. పాఠశాలలో, కళాశాలలో స్కాలర్‌షిప్‌లతో చదువుకుని జేపీఎస్, కోల్ ఇండియాలో మేనేజర్, ఏఈఈ, ఇటీవల వెలువడిన ఫలితాల్లో అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించారు ప్రసాద్ మురారి పోలేపల్లి.



తల్లితో ప్రశాంత్ మురారి పోలేపల్లి

★ తన అనుభవాలను ఆయన మాటల్లోనే.. 'ఇద్దరు అక్కలు, అన్నతోపాటు నాలుగో సంతానంగా పుట్టాను. ఊహ రాకముందే నాన్న చనిపోయారు. అమ్మ ముత్యాలమ్మ అన్నీ తానై కష్టపడి కూలీ పనులు చేస్తూ.. మమ్మల్ని పెంచింది. అమ్మ కష్టాలను చూసి సమాజంలో గౌరవించేలా బతకాలని నిర్ణయించుకున్నాను. అందు కోసం ప్రతి వేసవి సెలవుల్లో క్యాటరింగ్ లాంటి పనులు చేసి చదువుకున్నాను. 2017లో బీటెక్ అయిపోయాక సంవత్సరం విరామం తీసుకుని ఎంటెక్‌లో చేరాను. చదువుతూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. 2018లో జేపీఎస్ తొలి ఉద్యోగం సాధించాను. తరువాత 2021లో కోల్‌ఇండియాలో మేనేజర్‌గా పశ్చిమబెంగాల్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా.. చేరలేదు. 2024లో ఐ క్యాడ్ ఏఈఈ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో ఉద్యోగం చేస్తున్నాను. టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించాను.'

# వైన్స్‌లో రూ.10.84 లక్షలు మాయం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: పండగ రోజున గుర్రంపోడులోని ఓ వైన్స్‌లో రూ.10.84 లక్షల నగదు మాయమైంది. ఈ ఘటన తాలుకు దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం అర్ధరాత్రి 1:30 గంటలకు ఓ ఆగంతకుడు ఆదిత్య వైన్స్ పైకప్పు రేకును తొలగించి దుకాణం లోపలికి చొరబడి నగదు కట్టలను తీసుకుని ఉడాయించాడు. దుకాణం యజమాని పానుగోటి నర్సింహారావు ఆదివారం ఉదయం దుకాణం షట్టరు తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ ధనుంజయ, ఎస్‌ఐ నారాయణరెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన వీడియో ఫుటేజీల ఆధారంగా ముఖానికి మాస్కు, నల్లటి బనియను ధరించిన 30 ఏళ్ల యువకుడు ఈ చోరీకి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు లభించిన ఆధారాలతో పోలీసులు దొంగ ఆచూకీ కనిపెట్టే ప్రయత్నంలో నిమఘ్నమయ్యారు.



అనుమానితుడు రమేష్ బిస్త్

సీసీకెమెరాలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడు

★ ఇదిలా ఉండగా.. నల్గొండ జిల్లాలోని పలు వైన్స్‌ల్లో జరిగిన దొంతనాల్లో గుర్రంపోడు చోరీనే భారీ ఘటనగా చెబుతున్నారు. కొండమల్లేపల్లి, దేవరకొండ, నల్గొండ తదితర పట్టణాల్లో వైన్స్‌ల్లో దొంగతనాలు జరిగాయని, వాటిల్లో కూడా నల్లటి బనియను ధరించి మాస్కు వేసుకున్న వ్యక్తే దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరులో నివాసం ఉంటున్న నేపాలియన్ రమేష్ బిస్త్ నిత్యం పట్టణాల్లో తిరుగుతూ లాడ్జీల్లో ఉండి వైన్స్‌ల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసుల వద్ద ప్రాథమిక సమాచారం ఉంది.

# దేవాదాయ భూములను రక్షిస్తాం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు, ఆక్రమణకు గురైనవి కాపాడుకునేందుకు రికార్డులు సిద్ధం చేయిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో శ్రీచక్రాలయ ప్రారంభానికి విచ్చేసిన సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె పై విధంగా స్పందించారు. ఆక్రమణకు గురైన దేవాదాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. కోర్టులో పెండింగ్ కేసులపై ఆమె మాట్లాడుతూ.. వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా న్యాయ నిపుణులను నియమించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దేవాదాయ భూములను ఆదాయ వనరులుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆలయ భూములు కబ్జా కాకుండా ఉండేందుకు జియో ట్యాగింగ్ చేస్తున్నామని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న కొండా సురేఖ

# ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి: మరొకరికి తీవ్ర గాయాలు

వలిగొండ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ముద్దాపురం మదిర గ్రామం కొడమర్లబావి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ముద్దాపురం అనుబంధ గ్రామం కొడమర్లబావికి చెందిన దూది నర్సిరెడ్డి(52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామంలో రోడ్డు పక్కన మిత్రులకు జమ్మి పెడుతుండగా మోత్కూరుకు చెందిన కూరెళ్ల విష్ణు తన ద్విచక్రవాహనంతో అతి వేగంగా వచ్చి నర్సిరెడ్డిని, గున్నాల రక్షిత్‌రెడ్డిని బలంగా ఢీకొట్టాడు. నర్సిరెడ్డి, రక్షిత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తీసుకెళ్లగా నర్సిరెడ్డి అప్పటికే మృతి చెందగా.. రక్షిత్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగేందర్ ఆదివారం తెలిపారు.



దూది నర్సిరెడ్డి


# ముక్కలాగించారు.. చుక్క తాగేశారు..!

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 12న జరిగిన దసరా వేడుకలను అన్ని వర్గాల వారు ఘనంగా జరుపుకున్నారు. పండగ శనివారం కావడంతో కొంత మంది మందు, మటన్, చికెన్‌కు వెనకడగు వేసినా.. అంతకు మించి ఆదివారం దసరా వేడుకలు జరుపుకున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌తో పాటు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి ప్రధాన కూడళ్లలో రావణదహనం నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పోలీస్ యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.



★ దసరా సందర్భంగా గడిచిన రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.47.13 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీశాఖ లెక్కలు చెబుతున్నాయి. అందులో నల్గొండ సూర్యాపేటలో 33,725 మద్యం కాటన్లు, 41,798 బీరు కాటన్లు అమ్మకాలు జరగగా.. రూ.33.97 కోట్ల ఆదాయం వచ్చింది. యాదాద్రి భువనగిరి మద్యం డిపో నుంచి 11,927 మద్యం కాటన్లు, 14,687 బీరు కాటన్లు అమ్మకాలు జరుగగా.. రూ.12.16 కోట్ల ఆదాయం వచ్చింది.

★ 860 చికెన్ షాపుల్లో సుమారు 2.75 కోట్ల అమ్మకాలు జరిగినట్లు సంఘం నాయకులు చెబుతున్నారు. 550 మటన్ షాపుల్లో రూ.3.50 కోట్లు, చేపలు ఇతర మాంసాహారం రూ.2.65 కోట్లతో పాటు సుమారు రూ.2 కోట్ల వరకు శీతల పానీయాల అమ్మకాలు జరిగినట్లు వ్యాపార సంబంధిత సంఘాల నాయకులు చెబుతున్నారు.



# 105 మందికి.. 21 మందే

◆ 'మూసీ' కి సిబ్బంది కొరత



నిర్వహణ లేక డిస్ట్రిబ్యూటరీ కాలువలో పెరిగిన కంపచెట్లు, పేరుకుపోయిన ముళ్లపొదలు

కేతేపల్లి,న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 33 వేల ఎకరాల భూములకు సాగునీరు అందిస్తున్న మూసీ ప్రాజెక్టుని సిబ్బంది కొరత వెంటాడుతోంది. రిజర్వాయర్ డ్యామ్ నిర్వహణ, కుడి, ఎడమ కాలువలు, డిస్ట్రిబ్యూటరీల పర్యవేక్షణ, చిన్నచిన్న మరమ్మతులు తదితరాల కోసం ఇంజినీరింగ్ అధికారులు మొదలుకొని నీటి పారుదలశాఖలోని 21 విభాగాలకు సంబంధించి మొత్తం 105 పోస్టులను అప్పట్లో కేటాయించారు. అందులో ప్రస్తుతం 21 మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తుండటం గమనార్హం. చివరి ఆయకట్టు భూముల వరకు నీటిని అందించేందుకు 15 మంది లస్కర్లను ఓఅండ్ఎం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. ఒక డీఈఈ, నలుగురు ఇంజినీర్లు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, ఎలక్ట్రీషియన్, లస్కర్లు తదితర 17 మంది ఉద్యోగులు ఉన్నారు.

◆ వాస్తవానికి కుడి, ఎడమ కాలువలో నీరు చివరి ఆయకట్టు వరకు వెళ్లడం, ఎర్త్‌డ్యామ్ నిర్వహణ కోసం 52 మంది లస్కర్లు అవసరమని నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ప్రారంభ కాలంలో పోస్టులను మంజూరు చేశారు. మూసీ కాలువలకు నీరు విడుదల చేసిన సమయంలో డ్యామ్‌పై, కుడి, ఎడమ కాలువలపై పగలు, రాత్రి నిరంతరం పర్యటించే అధికారులు, సిబ్బంది సంఖ్య ఏయేటికాయేడు తగ్గిపోతుండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

### ఖాళీ అయితే భర్తీ లేదు

నీటిపారుదలశాఖ నుంచి మూసీ ప్రాజెక్టుకు కేటాయించిన సిబ్బంది పోస్టు ఖాళీ అయితే భర్తీ కాకుండా మిగిలిపోతుంది. అధికారులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందడం, ఇతర ప్రాంతాలకు బదిలీ అవడం, అనారోగ్య కారణాలతో మృతిచెందడం తదితరాలతో పోస్టులు ఖాళీలు అవుతున్నాయి. డ్యామ్, కుడి, ఎడమ కాలువలకు ఐదుగురు ఇంజినీర్లు అవసరం కాగా దశాబ్దకాలం నుంచి మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం భర్తీ చేసిన ఇంజినీర్ ఉద్యోగాల్లో మూసీకి ముగ్గురు వచ్చారు. మూసీకి ఉన్న 21 రకాల క్యాడర్ ఉద్యోగుల్లో ప్రస్తుతం 10 క్యాడర్ ఉద్యోగుల పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగా ఉంటున్నాయి.

### పొరుగు సేవల పద్ధతిన సిబ్బంది:

– చంద్రశేఖర్, డీఈఈ, మూసీ

మూసీ నీటిని ఆయకట్టుకు విడుదల చేసినందున 15 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిన లస్కర్లను నియమించి నీటి విడుదల పర్యవేక్షణ చేస్తున్నాం. ఇబ్బందులు రాకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బందితో పనులు కొనసాగిస్తున్నాం. రైతులు కూడా సహకరించి నీటి వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటే చివరి ఆయకట్టు వరకు నీరు పారేలా సహకరించాలి.

### శిథిల భవనాలు.. అపహరణకు గురవుతున్న ఆస్తులు..

మూసీ అధికారులు, సిబ్బంది నివాసం ఉండేందుకు సూర్యాపేట, కేతేపల్లి, మూసీ డ్యామ్ దిగువన, పిల్లలమర్రిలో క్వార్టర్లు నిర్మించారు. వాటిలో ఉండేవారు లేకపోవడం, నిర్వహణ కొరవడటంతో అవి ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. సిబ్బంది లేక కాలువలపై పర్యవేక్షణ కొరవడి డిస్ట్రిబ్యూటరీల షట్టర్లు, ఇనుప రాడ్లు, వంతెనల రెయిలింగ్, క్వార్టర్ల తలుపులు, కిటికీలు అపహరణకు గురవుతున్నాయి. రెండున్నర దశాబ్దాల క్రితం మూసీ పర్యాటకానికి తలమానికంగా ఉన్న అతిథి గృహం ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది.



సిబ్బంది లేక కేతేపల్లిలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్లు

# తరలివచ్చిన జనం.. రావణ దహనం

చౌటుప్పల్‌లో విజయ దశమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి పూజలు నిర్వహించి కలశం ఉద్వాసన చేసి టపాసులతో రావణ దహనం, నాగు పాము విన్యాసాలు ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పుర ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు కాంశెట్టి చంద్రశేఖర్, పాలడుగు వెంకన్న టపాకాయలు కాల్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్



# పండగ రోజు విషాదం



నాగయ్య

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండగ సామగ్రి తీసుకుని ఇంటికి వస్తుండగా.. డీజే వాహనం ఢీకొని ఓ వివాహితుడు మృతి చెందగా. మరొకరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని రాయినిపాలెం గ్రామశివారులో శనివారం చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్సై పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూర నాగయ్య(34), బూర సైదులు ఇద్దరు ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడ పట్టణానికి వెళ్లి పండగ సామగ్రిని తీసుకుని ఇంటికి తిరిగి వస్తూ గ్రామశివారుకు చేరుకోగానే.. గ్రామం నుంచి ఆలగడప వెళ్తున్న డీజే వాహనం అతివేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్య, సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరిని పరీక్షించిన వైద్యులు నాగయ్య అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సైదులుకు చికిత్స అందించి.. మెరుగైన వైద్యసేవల కోసం హైదరాబాద్‌కు తరలించారు. నాగయ్య భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరణోత్తర పరీక్షల అనంతరం నాగయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# ఇరువర్గాల పరస్పర దాడులు, పలువురిపై కేసులు

చిలుకూరు, న్యూస్‌టుడే: బేతవోలులో శనివారం జరిగిన దసరా ఉత్సవంలో ఘర్షణ చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న ఏఎస్సై వెంకటేశ్వర్లుపై దాడి చేయడంతో గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్, ఆయన భార్య రాణితో పాటు మరో ముగ్గురిపై ఏఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి తెలిపారు.

❑ పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఏటా కనక దుర్గమ్మ ఆలయం వద్ద వీర్లదేవి చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచి వట్టికూటి చంద్రకళ భర్త నాగయ్యగౌడ్ అక్కడకు వచ్చారు. చెరువు వద్దకు వచ్చిన తరువాత నాగయ్య మూత్ర విసర్జన చేస్తుండగా గ్రామానికి చెందిన వినోద్ చరవాణిలో ఈ దృశ్యాన్ని చిత్రీకరిస్తుండటంతో.. నాగయ్య కుటుంబ సభ్యుల్లో ఒకరైన నరేశ్ అతడిని ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ మొదలైంది.

❑ గతంలో జరిగిన పలు ఘటనల నేపథ్యంలో అక్కడే ఉన్న వరకుమార్ కుటుంబ సభ్యులు, నాగయ్య కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు ఘర్షణకు దిగారు. అక్కడే ఉన్న కోదాడ పట్టణ సీఐ రాము, చిలుకూరు ఎస్సై రాంబాబు, ఏఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చి వరకుమార్ వర్గం వారిని దేవాలయంలోకి, మరో వర్గం వారిని దేవాలయం నుంచి దూరంగా పంపించారు. నాగయ్య వర్గానికి చెందిన సభ్యులు దేవాలయ చిన్న గేటు నుంచి లోపలికి వెళ్లడంతో మళ్లీ ఉద్రిక్తత ఏర్పడింది. ఇరువర్గాల వారు రాళ్లు, అక్కడే ఉన్న పైపులు ఒకరిపై ఒకరు విసురుకున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఘటనలో సీఐ రాము తలకు వెనుక భాగంలో, ఏఎస్సై వెంకటేశ్వర్లుకు కంటి భాగంలో గాయాలయ్యాయి. నాగయ్య వర్గానికి చెందిన పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పోలీసులు చేరుకొని వరకుమార్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకొన్నారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో సమస్య సద్దుమణిగింది. రాత్రి మొత్తం పోలీసులు గ్రామంలో పికెట్ నిర్వహించారు. ఈ ఘటనపై నాగయ్య సైతం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ దుర్మరణం



జర్పుల బిచ్యా నాయక్

మర్రిగూడ, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నల్గొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొండూరు గ్రామ పంచాయతీ ఆవాస ప్రాంతం తూర్పు తండాకు చెందిన జర్పుల బిచ్యానాయక్ (35) ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం తన సొంత పని మీద మండల కేంద్రానికి వచ్చి తిరిగి పయనమయ్యాడు. అదే సమయానికి కొండూరు గ్రామానికి చెందిన దుబ్బ శివ అతని బంధువు ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వెళ్తున్నారు. దోర్నాల బావి వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బిచ్యా నాయక్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. దసరా పండగ రోజు అందరితో సంతోషంగా గడపాల్సిన సమయంలో చనిపోవడంతో తండాలోని గిరిజనులు అంతా బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై రంగారెడ్డి తెలిపారు.

### చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారంరేటు | 126–00 |
| రిటైల్ | 146–00 |
| డ్రెస్డ్ | 215–00 |
| స్కిన్‌లెస్ | 244–00 |

నల్గొండ
•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

### మానవ హక్కుల సంఘం కార్యదర్శిగా నియామకం

నీలగిరి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర విద్యావిభాగం కార్యదర్శిగా నల్గొండకు చెందిన ఖాజ మొహితుల్లాను నియమించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అంతర్జాతీయ ఛైర్మన్ నేమ్‌సింగ్ ప్రేమి నియామక పత్రం అందజేశారు. తన పైన నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఛైర్మన్ కొమ్ము అగ్రిప్ప, వైస్ ఛైర్మన్ మహ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యా వ్యవస్థలో సంస్కరణలు శుభసూచకం

నల్గొండ టౌన్: ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకవస్తున్న సంస్కరణలు శుభసూచకమని ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి బైరు దుర్గాప్రసాద్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో ప్రభుత్వం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### విరాళం అందజేత

చండూరు, న్యూస్‌టుడే: బంగారిగడ్డలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మదేవి ఆలయ నిర్మాణానికి గానూ గ్రామానికి సుంకరి చంద్రశేఖర్‌గౌడ్ రూ.10 వేలు ఆలయ కమిటీ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. సుంకరి రాములుగౌడ్, లింగయ్య, యాదయ్య, రాజు, ముత్తయ్య, నర్సింహ, సాల్మన్ పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలో న్యూ వైతన్యపురికాలనీలో మురుగు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల మధ్యన మురుగు కూపాలు పేరుకుపోతున్నాయి. కాల్వలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.
–జయ, నల్గొండ.

✔ పరిశీలించి మురుగు నీరు నిల్వకుండా దిగువకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నల్గొండ పురపాలిక.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవిశెట్టి వినయ్ వరికోత యంత్రంపై హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో వరి కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు యంత్రానికి అంటుకున్నాయి. దీంతో వరికోత యంత్రంపై ఉన్న డ్రైవర్ అనిల్ అనే యువకుడు గమనించి కిందకి దూకగా, పక్కనే ఉన్న అవిశెట్టి వినయ్(18) అనే వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యారు. చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా వినయ్ మృతి చెందారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఎస్సై ఎస్.ధర్మా తెలిపారు.


అవిశెట్టి వినయ్

### చికిత్స పొందుతూ వ్యక్తి..

శాలిగౌరారం, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఆత్మహత్యాప్రయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం ఆకారానికి చెందిన శనిగ నాగరాజు తిరుమలగిరి మండలం తండ గ్రామంలో ఓ క్రషర్ మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆ మిల్లు యజమాని అక్రమంగా కేసు పెట్టించి పోలీసులతో కొట్టించాడనే మనస్తాపానికి గురై ఈనెల 4న ఆకారంలో తన బావిదగ్గర చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు, స్నేహితులు గమనించి ఆసుపత్రికి తరలించారు. నాగరాజు హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

## బ్రహ్మదేవర చెరువు కబ్జా


అలుగును ఆక్రమించి సాగు

కట్టంగూరు, న్యూస్‌టుడే: భూముల ధరలు పెరుగుతుండటంతో అక్రమార్కుల కన్ను చెరువులు, కుంటలపై పడింది. మండలంలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. రియల్ వ్యాపారులు పట్టా భూములు కొనుగోలు చేసి పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మవుతున్నాయి. చెరువుల కబ్జాతో ఆయకట్టుకు ఆశించిన స్థాయిలో నీరందడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### జాతీయ రహదారి వెంబడి..

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి కూతవేటు దూరంలోని కట్టంగూరు మండలం అయిటిపాముల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 435 లో 191 ఎకరాల్లో బ్రహ్మదేవర చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద 800 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు నీటిపారుదలశాఖ దస్త్రాలు తెలుపుతున్నాయి. పరోక్షంగా రెండు వేల ఎకరాల్లో వ్యవసాయ బోర్ల ద్వారా ఆయకట్టు ఆధార పడి ఉంది. అయితే ఈ సర్వే నెంబర్ సమీపంలో ఉన్న పట్టా భూమి సర్వే నెంబర్లలోని వ్యవసాయ పట్టా భూములు కొనుగోలు చేస్తున్న రియల్ వ్యాపారులు ఈ చెరువుకు సంబంధించిన సుమారుగా 30 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేశారు. ఆక్రమిత భూమిలో మట్టి పోసి చదును చేసి, సాగుభూమిగా మార్చుకున్నారు. ఈ ప్రాంతంలో ఎకరా ధర రూ. 40లక్షలకుపైగా ధర పలుకుతుంది. ఈ చొప్పున ఈ ఒక్క చెరువుకు సంబంధించిన రూ. 12 కోట్ల విలువైన భూమి ఆక్రమణకు గురైందని స్థానికులు తెలిపారు. కబ్జాలతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. రోజు రోజుకు పెరుగుతున్న ఆక్రమణలతో భవిష్యత్తులో చెరువు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి చెరువులను కాపాడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

#### రూ.100 కోట్లతో పనులు..

నియోజకవర్గంలోని కట్టంగూరు, నకిరేకల్, శాలిగౌరారం మండలాల్లోని 8 గ్రామాలకు చెందిన 9 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అయిటిపాముల చెరువు వద్ద రూ. 100 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు చేపట్టేందుకు గత ఏడాది సెప్టెంబరులో అప్పటి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ఆ పనులు మొదలయ్యాయి. అయినా.. ఈ చెరువు ఆక్రమణల నుంచి కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకునేందుకు కనీస చర్యలు చేపట్టడం లేదు. చెరువు ఆక్రమణలపై నీటి పారుదలశాఖ... రెవెన్యూశాఖల అధికారల మధ్య సమన్వయంలేకుండా పోయింది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం తమ శాఖ పరిధికాదంటే.. తమ శాఖ పరిధి కాదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.


చెరువు మధ్యలో వరిసాగు

#### కొత్తగా ఆక్రమణకు గురికాలేదని..

చెరువు ఆక్రమణపై నీటిపారుదల శాఖ ఏఈ పాండునాయక్ విచిత్రమైన సమాధానం చెప్పారు. అయిటిపాముల చెరువు ఆక్రమణకు గురికాకుండా సత్వరమే చర్యలు తీసుకుంటామని 'న్యూస్‌టుడే'తో చెబుతూనే.. ఆ చెరువు ఆక్రమణ గతంలో జరిగిందని.. ఇప్పటికిప్పుడు కొత్తగా ఏమీ ఆక్రమించలేదని సమాధానం ఇచ్చారు. ఆక్రమణ అనేది ఎప్పుడు జరిగినా.. వాటిని తొలగించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నప్పటికీ కొత్తగా ఆక్రమించలేదని తప్పించుకునే సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

### క్రీడల్లో సత్తా చాటాలి

మర్రిగూడ, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చాటాలని సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్‌యాదవ్ అన్నారు. యరగండ్లపల్లిలో ఆదివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన హనుమంతు టీంకు రు. 11,116, ద్వితీయ బహుమతి శోభన్ టీం కు రూ. 5,116 అందజేసి మాట్లాడారు. క్రీడల్లో రాణించి గ్రామానికి మండలానికి గుర్తింపు తీసుకురావాలని తెలిపారు.

### కేసు నమోదు

నాంపల్లి, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చల్లవానికుంటలో ఓ యువకుడి అనుమానాస్పద మృతి నేపథ్యంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాంపల్లి ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లవానికుంట గ్రామానికి చెందిన రాపోతు మధు(21)ను గత నెల వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా జరిగిన గొడవల్లో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అతనిపై ఘర్షణ పడ్డారు. ఈ కారణంగా అతనిపై చేయిచేసుకోవడంతో అనారోగ్యంతో మూడు రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మధు ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని గ్రామంలోని ఆయా అనుమానితుల ఇంటి ఎదుట ఉంచుతారనే సమాచారంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్రమత్తమైన పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహించి మృతదేహాన్ని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మూగ వేదన.. అరణ్య రోదన

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: మూగ వేదన.. అరణ్య రోదన అన్న చందంగా మారింది మాడ్గులపల్లి పశు వైద్యశాల పరిస్థితి. మాడ్గులపల్లి మండలం ఏర్పాటు కాక ముందు ఇక్కడ అన్ని వసతులతో పశువైద్యశాలను నిర్మించారు. ఒకట్రెండేళ్లు సక్రమంగానే సేవలు అందించింది. అంతలోనే నూతన మండలం ఏర్పాటు అయ్యింది. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను అద్దెభవనాలు, మరికొన్నింటిని పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని మాత్రం తాత్కాలికంగా పశువైద్యశాలలో ఏర్పాటు చేశారు. ఇక్కడి పశువైద్యశాలను ఇదే ఆవరణంలోని మరో గదిలోకి మార్చారు. అప్పటి నుంచి పశువైద్యానికి ఆటంకం కల్గుతోంది. ప్రస్తుతం ఉన్న గదిలో సరైన సౌకర్యాలు లేక వైద్యాధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాల లోపల స్మాల్ ఎనిమల్ సర్జికల్ టేబుల్ లేకపోవటంతో ఆరుబయట తాత్కాలికంగా సిమెంట్ ఇటుకలతో ఏర్పాటు చేసిన గోడపై చికిత్స చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గడ్డి విత్తనాలు నిల్వ చేయటానికి అనువైన గది లేకపోవడంతో రైతులకు గడ్డి విత్తనాలు అందించలేక పోతున్నారు. గడ్డి విత్తనాల రకాల గురించి రైతులకు తెలియజేయడానికి పశువైద్యశాల ఆవరణంలో గడ్డి పెంచాల్సి ఉంది. కానీ.. తహసీల్దారు కార్యాలయానికి వచ్చే వాహనాలతో ఆ ప్రదేశం నిండిపోతుంది. మందులు, వ్యాక్సిన్ నిల్వ చేయడానికి ఉండాల్సిన రెండు రిఫ్రిజిరేటర్లలో కేవలం ఒక్కటే ఉంది. పశువులకు చికిత్స చేయటానికి మట్టితో ఏర్పాటు చేసిన ప్రదేశంతో పాటు నీటి తొట్టి అందుబాటులో లేవు. ఏదైనా పశువుకు ప్రమాదకరంగా ఉంటే రెండు రోజుల పాటు అక్కడే పరిశీలించటానికి ప్రత్యేక సౌకర్యం కలిగి ఉండాలి. క్యాంపులు నిర్వహించినప్పుడు వైద్యులు ఉండటానికి ప్రత్యేకంగా గది ఉండాలి. ఇలాంటివి లేకపోవటంతో వైద్యం చేయటానికి వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు.


మాడ్గులపల్లిలో ఆరుబయట ఇటుకలతో ఏర్పాటు చేసిన స్మాల్ ఎనిమల్ సర్జికల్ టేబుల్‌పై చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి

#### ఇబ్బందులు తప్పటం లేదు..

వినయ్‌కుమార్, పశువైద్యాధికారి, మాడ్గులపల్లి

వైద్యశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పశువైద్యం కోసం నిర్మించిన భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చే ప్రజలతో ఆవరణం అంతా ఇబ్బందిగా మారుతోంది. పశువులు బెదిరిపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న గదిలో సౌకర్యాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయాన్ని వేరొక చోటుకు తరలించాలి.

### టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరమేశ్‌యాదవ్

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా నూతన ప్రధానకార్యదర్శిగా తరాల పరమేశ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి తెలిపారు. నల్గొండలో ఆదివారం జరిగిన టీఆర్‌టీఎఫ్ జిల్లా అత్యసవర సమావేశానికి ఆయన హాజరై నియామక పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపరిష్కారానికి తమ సంఘం పాటుపడిందన్నారు. పరమేశ్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులకు మెరుగైన సేవలు అందించి సంఘం బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు. ప్రపంచ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సెక్రటరీ జనరల్ ఎంవీ.గోనారెడ్డి, నకిరేకల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. బెల్లియాదయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవధ్యక్షుడు వోలి సమీర్‌కుమార్, బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు కొన్నె శంకర్‌గౌడ్, వైద్యుల సత్యనారాయణ తదితరులు పరమేశ్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



తరలా పరమేశ్‌యాదవ్‌కు నియామక పత్రం అందచేస్తున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి

## కాల్వల శుభ్రతపై నిర్లక్ష్యమేలా..!


రోడ్డుపై పారుతున్న వ్యర్థాల నీరు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: పట్టణంలో పలు ప్రాంతాల్లో కాల్వల నిర్వహణ లేమితో మురుగు నీరు రోడ్ల పై పారుతోంది. వాటిని శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు, చెత్త కాల్వల్లో నిండి మురుగునీరు పొంగి పొర్లుతోంది. పరిసర ప్రాంతాలకు దుర్వాసన వ్యాపిస్తోంది. వ్యాధులు ప్రబలే అవకాశం నెలకొందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పట్టణంలోని పాతబస్తీ సిమెంటు రోడ్డు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రకాశంబజారు వెళ్లే మార్గంలో ఇందిరాబజార్‌లో దుకాణాల ముందు నిత్యం మురుగు నీరు రోడ్డు పారుతోంది. అదే విధంగా దేవరకొండ రోడ్డు నుంచి మునుగోడు వెళ్లే జంక్షన్‌లో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు తట్టి నీరు దిగువకు వెళ్లలేక కాల్వ పొంగి పొర్లుతోంది. మురుగు నీరు అంతా రోడ్డుపై పారడంతో కూడలి దుర్గంధభరితంగా మారింది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాల్వలపై దృష్టి సారించి శుభ్రం చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


కాల్వ నిండి పొంగుతున్న మురుగు నీరు

### వృద్ధులకు పంపిణీ

నకిరేకల్, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినం సందర్భంగా నకిరేకల్‌లోని లయన్స్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, దుస్తులు, పండ్లను శనివారం పంపిణీచేశారు. దాతలు ముందుకొచ్చి వృద్ధులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నెమరుగొమ్ముల రాంమోహన్‌రావు, కార్యదర్శి యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, దాత కందాళ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్: వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ రాంమోహన్‌రావు, కార్యదర్శి యాదగిరిరెడ్డి, దాత నారాయణరెడ్డి

### సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** మార్టిన్, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ-** వేట్టయన్, **వెంకటేశ్వర-** దేవర

### సీపీఐ సంతాపం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మానవ హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిబాబా మానవ హక్కుల అదివాసుల పై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా గళం విప్పిన నేత అన్నారు. భాజపా సాగిస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిలబడ్డ మేధావి అని అన్నారు.

నాంపల్లి: దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతికి ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లోని సరస్వతీ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒక చోట చేరిన చిన్నానాటి మిత్రులు తమ పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ మారుపాక నర్సయ్య, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


నకిరేకల్: సరస్వతీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

### పండగ పూట ప్రమాదాలు

నాంపల్లి, న్యూస్‌టుడే : సరదాల 'దసరా' పర్వదినం పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మండల కేంద్రంలో పండగ ముందు రోజుకంటే తర్వాత రోజు వాహనాల రద్దీ ఎక్కువైంది. మందు బాబులు తమ 'డాబు' చూపించే వాహనాలు, చిన్నపిల్లలతో కార్లు డ్రైవింగ్ చేపిస్తూ తమ దర్పం చాటుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా మద్యం దుకాణాల వద్దనే ఈ తంతు ఎక్కువగా కనిపించింది. ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో ఓ కారు ఢీకొని వడ్డెపల్లికి చెందిన వృద్ధుడి కాలు విరిగింది. విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలోని మద్యం దుకాణాల వద్ద అదుపు తప్పిన ద్విచక్ర వాహనం, మరో కారు ఢీకొని నలుగురుకి గాయాలయ్యాయి. కాగా ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని నాంపల్లి ఎస్సై ఎం.రాంబాబు తెలిపారు.


నకిరేకల్: శివాలయంలో శమీపూజలో ఎమ్మెల్యే వీరేశం, పుర ఛైర్‌పర్సన్ రజిత..


నల్గొండ: రామాలయంలో పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు..


నల్గొండ: వెంకటేశ్వరకాలనీలో..


నల్గొండ: గాంధీపార్కులో ఆర్యవైశ్య సంఘం నాయకులు..


అమెరికాలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన మహిళలు

## ఆనందోత్సాహాల మధ్య దసరా

దసర ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ శమీ పూజలను శాస్త్రోక్తంగా శనివారం ఉదయం జరిపారు. దేవాలయాలు, కాలనీల్లోని కూడళ్లలో జమ్మిపూజలు నిర్వహించారు. జమ్మి చెట్టు ఆకులు కోసుకొని, స్నేహితులు, బంధువులకు పంచుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలు చోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జమ్మి చెట్ల వద్దకు ప్రజలు డప్పు చప్పుళ్లు, కోలాటాల ప్రదర్శనలతో తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం పాలపిట్టలను దర్శించుకున్నారు. పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. టపాకాయలు కాల్చుతూ సంబురాలు జరిపారు. పలు చోట్ల రావణ దహనం కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాత మండపాల వద్ద ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. బంధువుల రాకతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకుంది. మద్యం, మాంసం అమ్మకాలు జోరుగా సాగాయి. శాలిగౌరారంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆయుధ, జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజ చేశారు.
–న్యూస్‌టుడే, బృందం:


నాంపల్లి : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


గట్టుప్పల: మార్కండేయ స్వామి దేవస్థానంలో..


గట్టుప్పల: కాళికామాతా అవతారంలో ఉన్న కళాకారులు

### గంగమ్మ చెంతకు గాయత్రీదేవి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవరాత్రులు పూజలందుకుని తొమ్మిది అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవీ అమ్మవార్లు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. –న్యూస్‌టుడే, బృందం


కట్టంగూరులో శమీ పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, స్థానికులు


నల్గొండ: ఎన్జీకళాశాలలో..


నల్గొండ: వివేకానందనగర్‌లో రావణ దహనం..


చంద్రగిరి విల్లాస్ కాలనీలో..


కేతేపల్లి మండలం చెరుకుపల్లిలో..


చిట్యాల: పురఛైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు

# మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

## ఓఆర్‌లో దేవరకొండ మొదటి స్థానం

**దేవరకొండ, న్యూస్‌టుడే:** దసరా పండుగ సందర్భంగా దేవరకొండ ఆర్టీసీ డిపో ఈ నెల 11న బస్సుల ద్వారా ఒక్కరోజే రూ.35.86 లక్షల ఆర్జించి ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 118.90తో రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించినట్లు డిపో మేనేజర్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 46,755 కిలోమీటర్లు నడిపి 51,750 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేయడం జరిగిందన్నారు. ఇంత స్థానం సాధించడం ఆర్టీసీ ఉద్యోగస్తుల క్రమశిక్షణ, ప్రయాణికుల ఆదరణ వల్ల సాధించడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

## ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

**మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:** దసరా పండగకు సొంతూళ్లకు వచ్చి తిరిగి పని ప్రదేశాలకు వెళ్లే ప్రయాణికులతో ఆదివారం సాయంత్రం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. హైదరాబాద్, దేవరకొండ, కోదాడ ప్రాంతాలకు ప్రయాణికులకు సరిపడా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఆయా ప్లాట్‌ఫాంలు రద్దీగా మారాయి. హైదరాబాద్ వెళ్లేందుకు పలువురు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

## ఆచార్య సాయిబాబా ఆశయాలు సాధించాలి

**మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:** అంగవైకల్యంతో బాధ పడుతూనే పేదల హక్కుల కోసం తన జీవితమంతా పోరాడిన ఆచార్య సాయిబాబా ఆశయాలు సాధించాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆచార్య సాయిబాబా మరణంపై చింతిస్తూ ఆదివారం మిర్యాలగూడలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. ఎటువంటి సాక్ష్యం లేని కేసులో ఆయనను తొమ్మిదేళ్ల పాటు జైలులో నిర్బంధించి తీవ్ర అనారోగ్యానికి గురి చేసిన దేశ ప్రభుత్వం, వ్యవస్థీకృత హత్యగా గుర్తించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీసం రామయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, డి.గణేష్, బక్క శ్రీనివాసచారి, ఖాదర్, డేగ వీటీ, హరికృష్ణ, ఉదయ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ఆచార్య సాయిబాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

★ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఆచార్య సాయిబాబా మరణం.. తీరని లోటని మట్టి మనుషుల ఫోరం కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## హర్షణీయం

**మిర్యాలగూడ పట్టణం:** కులగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో సంఖ్య 18 విడుదల చేయడం హర్షణీయమని.. ఇది బీసీల పోరాట ఫలితమేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) 77994 92939 | 99121 74975 | 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని ఈదులగూడ కూడలిలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి – కృష్ణ, మిర్యాలగూడ.

✔ పగటి వేళలో వీధి దీపాలు బంద్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**మిర్యాలగూడ పట్టణం:** గద్వాల్‌లో ఈ నెల 14న జరుగనున్న ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు మిర్యాలగూడలోని క్లియో స్పోర్ట్స్ ఎరీనాలో శిక్షణ పొందుతున్న మహీధర్ ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధి మారబోయిన రామకృష్ణ, శిక్షకుడు కావలి వెంకన్న తెలిపారు. ఆదివారం పట్టణంలో క్రీడాకారుడిని అభినందించి మాట్లాడారు. ఇటీవల సూర్యాపేటలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి కీపర్, బ్యాట్స్‌మెన్‌గా ఎంపికైనట్లు తెలిపారు.

## శిథిలావస్థలో పర్యాటక భవనం..
# ఆక్రమణకు యత్నం



పైలాన్ బస్టాండ్ సమీపంలోని పర్యాటక సంస్థకు చెందిన భవనం

**నాగార్జునసాగర్, న్యూస్‌టుడే:** నాగార్జునసాగర్ పైలాన్‌లో ఉన్న పర్యాటక సంస్థకు చెందిన భవనం శిథిలావస్థకు చేరడంతో స్థానికులు దాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. సాగర్ సందర్శనకు వచ్చిన పర్యాటకుల సౌకర్యం కోసం పర్యాటక అభివృద్ధి సంస్థ పైలాన్ బస్టాండ్ వద్ద అతిథి గృహాన్ని నిర్మించింది. మొదట్లో ఇది పర్యాటకులకు ఉపయోగపడినా రానురాను నిరుపయోగంగా మారింది. దీంతో పర్యాటక సంస్థ ఈ భవనాన్ని విద్యా సంస్థకు లీజుకు ఇచ్చింది. కానీ ఈ విద్యాసంస్థలు సక్రమంగా నడవకపోవటంతో వారూ వదిలేశారు. ప్రస్తుతం దీన్ని ఎవరూ వినియోగించకపోడంతో శిథిలావస్థకు చేరింది. ఇది గమనించిన స్థానికులు భవనాన్ని ఆక్రమించి అమ్మేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సందర్భంగా విజయవిహార్ మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ ఈ భవనం గురించి ఉన్నతాధికారులకు నివేదించామని.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఆక్రమణకు చదును చేసిన స్థలం

### భవనాలు లేక ఇక్కట్లు

**త్రిపురారం, న్యూస్‌టుడే:** నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో భవనాలు లేక పాలకవర్గం కార్యకలపాలు నిర్వహించుకోవడానికి గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. భారాస ప్రభుత్వం అప్పట్లో 500 జనాభా కలిగిన గిరిజన తండాలను, అవాస ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే మండలంలో బడాయిగడ్డ, రూప్లాతండా, లోక్యతండా, రాజేంద్రనగర్, అల్వాలపాడుతండా, సత్యంపాడుతండా, వస్రాంతండా, లచ్చతండా, కాపువారిగూడెం, కామారెడ్డిగూడెం గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో రాజేంద్రనగర్, అల్వాలపాడు తండా, లచ్చతండా, కాపువారిగూడెం, వస్రాంతండాల్లో గ్రామ పంచాయతీ భవనాలు పూర్తయ్యాయి. వాటిలో కావాల్సిన సామగ్రి ఇప్పటివరకూ లేవు. కామారెడ్డిగూడెంలో భవన నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. మిగతా నాలుగు గ్రామాల్లో స్థలం కొరత ఉంది. ఇదే విషయం పీఆర్ఏఈ వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఉపాధిహామీ పథకం కింద గ్రామ పంచాయతీల నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున మంజూరు అయినట్లు చెప్పారు. స్థలం కొరత కారణంగా ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు, కామారెడ్డిగూడెంలో త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



కామారెడ్డిగూడెంలో నిర్మాణ దశలోనే ఆగిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం



## సాగర్‌లో పర్యాటక సందడి

**నాగార్జునసాగర్, న్యూస్‌టుడే:** సాగర్ వద్ద ఉన్న సందర్శన స్థలాల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. దసరా సెలవులు పూర్తి కావొస్తుండటంతో ఆదివారం సాగర్ సందర్శనకు పర్యాటకులు అధికంగా వచ్చారు. హిల్‌కాలనీ వద్ద లాంచీ స్టేషన్, బుద్ధవనం తదితర ప్రాంతాలు పర్యాటకులతో కోలాహలంగా మారాయి.

## వెలిగిన దీపాలు

స్పందనకు వందనం

**కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే:** జడ్చర్ల నుంచి కోదాడ వరకు గల 167 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొండమల్లేపల్లి పట్టణంలో విభాగినిల మధ్య హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. స్థానిక దేవరకొండ రోడ్డులో గల తహసీల్ కార్యాలయం నుంచి కొలుముంతలపహాడ్ గ్రామం వైపు సుమారు ఒక కిమీ వరకు దీపాలు ఏర్పాటు నుంచి వెలగలేదు. ఈ నెల 7న 'ఈనాడు'లో 'పండగకైనా దీపాలు వెలిగేనా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు వేగంగా మరమ్మతులు చేసి పండగకు దీపాలు వెలిగేలా చేశారు.

## జ్ఞానాన్ని అందించడమే లక్ష్యం

**హాలియా, న్యూస్‌టుడే:** సమాజంలో ప్రతి వ్యక్తికి శాంతి సమానత్వం పెంపొందించేందుకు అనువైన జ్ఞానం అందించుటకు భక్తి యోగ కేంద్రం దోహదపడుతుందని హరే కృష్ణ నిర్వాహకుడు రామ్‌లక్ష్మణ్‌దాస్ అన్నారు. ఆదివారం హాలియాలో ఆయన కాంగ్రెస్ జిల్లా నాయకుడు యడవల్లి నరేందర్‌రెడ్డితో కలసి హరేకృష్ణ ఆధ్వర్యంలో భక్తి యోగకేంద్రం ప్రారంభించారు. వైద్యులు కోటిరెడ్డి, రాఘవేంద్ర, లింగారెడ్డి, జయవర్ధిని పాల్గొన్నారు.

## దోమలతో తప్పని తిప్పలు

**చింతపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని నెల్వలపల్లి గ్రామంలోని పలు ఇళ్ల ముందు మురుగు రోజుల తరబడి నిలిచి.. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో వర్షం నీరు నిలిచింది. ప్రవహించేందుకు అవకాశం లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్‌రెడ్డి తెలిపారు.



## ఆరునెలల క్రితం తవ్వారు.. పూడ్చేది ఎన్నటికో?



కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో మిర్యాలగూడ పట్టణంలోని పీఎంజే జ్యూయలర్స్ భవనం ఎదుట భారీ గుంతలు తీసి ఆరునెలలుగా పూడ్చకపోగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ ప్రధాన రహదారిలో నిత్యం వేలాది వాహనాలు వెళ్తుండగా ఏమాత్రం అదుపు తప్పినా గుంతలో పడే ప్రమాదం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతూ, దోమలు వ్యాపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. పనులను పూర్తి చేసి గుంతలు పూడ్చేలా చూస్తామని డీఈ బాలునాయక్ తెలిపారు. **- న్యూస్‌టుడే, మిర్యాలగూడ**

## బాబోయ్ గ్రామసింహాలు



మండల పరిధిలోని జప్తీవీరప్ప గూడెం, చిల్లాపురం పలుగ్రామాల్లో శునకాలు గుంపులుగా తిరుగుతూ నడిచేవారు, ద్విచక్రవాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తరచూ కుక్కలు దాడులు చూస్తున్నా... మండల, గ్రామాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను ఒంటరిగా పాఠశాలలకు, బయటకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. **- న్యూస్‌టుడే, మిర్యాలగూడ గ్రామీణం**

# ఆనందోత్సాహం.. విజయదశమి సంబరం



మిర్యాలగూడ గాంధీనగర్‌లోని మండపంలో రాజరాజేశ్వరి దేవి అవతారంలో...



మిర్యాలగూడ గ్రామీణం: యాద్గార్‌పల్లిలో శ్రీకనకదుర్గమ్మ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



సాగర్: జమ్మిచెట్టు వద్ద భక్తులు



గుర్రంపోడు: కొప్పోలులో..



మిర్యాలగూడ: హిందూ ఉత్సవ సమితి రావణాసుర దహనం కార్యక్రమం




మిర్యాలగూడ: శ్రీ సాయిదత్త ఆశ్రమంలో..



మిర్యాలగూడలో.. ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడలో.. జమ్మిపూజకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



హాలియాలో..



పెద్దవూరలో హైకోర్టు ఏఏజీ రజనీకాంత్‌రెడ్డి



నిడమనూరులో...



చింతపల్లిలో...

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో దసరా పండగ ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ తొమ్మిది రోజులు పలు అవతారాలతో భక్తులకు దర్శనమిచ్చింది. ప్రతిష్ఠించిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. మిర్యాలగూడ పట్టణంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారుగడ్డలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జమ్మి పూజలు భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహించి.. జమ్మి ఆకును తీసుకుని పాలపిట్టను చూసి తరించారు. బంగారుగడ్డలో జరిగే దసరా ఉత్సవాలకు ఏటా రాజీవ్ చౌక్ నుంచి ట్రాఫిక్ నిలిపివేస్తారు. ఈ సారి పోలీసులు ఆ దిశగా ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో భారీగా తరలివస్తున్న ప్రజల మధ్య నుంచే వాహనాల రాకపోకలు సైతం సాగించాయి. దీంతో భక్తులు అనేక అవస్థలు పడ్డారు. మరో వైపు వాహనాలు యథేచ్ఛగా తిరుగుతుండడంతో కొందరు ఆకతాయిలు హల్‌చల్ చేయడంతో మహిళలు, యువతులు ఇబ్బందులు పడ్డారు. పెద్దవూర మండలంలో శమీపూజ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు ఏఏజీ రజనీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీవైస్‌ఛైర్మన్ కర్నాటి లింగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకొండలో పెద్దరామాలయం నుంచి దేవతామూర్తులతో సేవా కార్యక్రమం ప్రారంభమై.. భక్తులు భజన, మేళతాళాలతో పంచ పాండవుల వేషధారణతో, బాజా భజంత్రీలు, కోలాటాలతో కోలాహలంగా దేవరకొండ పురవీధుల గుండా శోభాయాత్ర దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చేరుకుంది. దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో పలు దుర్గామాతల వద్ద ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**

## దుర్గామాత అనుగ్రహంతోనే సిరిసంపదలు: ఎమ్మెల్యే

**చింతపల్లి, న్యూస్‌టుడే:** దుర్గా మాత అనుగ్రహంతోనే సిరిసంపదలు కలుగుతాయని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గా మాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా యువకులు భక్తిశ్రద్ధలతో మాలలు ధరించి పూజలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, యాదగిరి, కొండూరి పవన్ కుమార్, సంజీవరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, యాచారం యాదయ్యగౌడ్, గోవర్ధన్, యాదగిరి పాల్గొన్నారు.



చింతపల్లిలో దుర్గామాతకు పూజలు నిర్వహించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**డిండి:** ఆధ్యాత్మిక దైవచింతనతో జీవితంలో ప్రశాంతంగా ఉంటారని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం సింగరాజుపల్లిలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**చింతపల్లి, న్యూస్‌టుడే:** బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. విజయ దశమి సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ భాజపా హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జహంగీర్, వెంకటరమణ, సైదులు, చెన్నయ్య, వెంకటరమణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.



చింతపల్లిలో భాజపా కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చెనమోని రాములు

★ హిందుత్వ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భాజపా రాష్ట్ర నాయకులు చికోటి ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత శోభయాత్రకు ఆయన హాజరై మాట్లాడారు. రాములు, రమేష్, శేఖర్, నగేష్, వెంకటరమణ, యాదయ్య పాల్గొన్నారు.

**దేవరకొండ:** మన సంస్కృతి, సంప్రదాయాలు ఇలాగే కొనసాగాలని భాజపా రాష్ట్ర నాయకులు ప్రవీణ్ అన్నారు. దేవి శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ధ్వజారోహణం నిర్వహించారు. దేవరకొండ పట్టణంలో వాడవాడలా డప్పు వాయిద్యాలతో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. ఉపేందర్, నర్సింహ, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, సుబ్బారావు ఉన్నారు.



## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేసే కొప్పూరి మాధవ (27) ఈ నెల 11న అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు... నాగార్జునసాగర్‌కు చెందిన మాధవ మూడేళ్లుగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మండల కేంద్రంలో ఓ గదిని అద్దెకు తీసుకొని, సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఎప్పటిలాగే పని ముగించుకొని ఈ నెల 11న గదికి వెళ్లి నిద్రించాడు. అతనితో కలిసి ఆసుపత్రిలో పని చేసే సహచరుడు అజిత్‌కుమార్ అదే రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గదికి వెళ్లి పిలవగా ఎలాంటి స్పందన లేదు. దీంతో అజిత్‌కుమార్ ఆసుపత్రిలోనే నిద్రించాడు. మరుసటి రోజు ఇంటి యజమానితో కలిసి తలుపులు పగులకొట్టి చూడగా మాధవ చనిపోయి ఉన్నాడు. మృతుడి సోదరుడు శేషగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మాధవ మృతికి కారణాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## సినిమాలు
మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

**రాఘవ:** దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్

**విట్రోస్:** దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, మార్టిన్

## ఈత సరదా.. వ్యక్తి గల్లంతు

**మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే:** దసరా పండగ వేళ బంధువులతో కలసి సరదాగా ఈత కోసం వెళ్లి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన మండల పరిధిలోని దొండవారిగూడెం సమీపంలో సాగర్ ఎడమకాల్వలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటాచారి(37) సమీప బంధువులతో కలసి ఎడమకాల్వ పక్కన ఉన్న పిల్ల కాల్వలో ఈత కొట్టడానికి వెళ్లారు. అక్కడ సరదాగా లేదని పక్కనే ఉన్న ఎడమకాల్వలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఒక సారి నీటిలోకి దూకి ఒడ్డుకు వచ్చారు. రెండోసారి నీటిలోకి దూకి నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా.. పక్కనే ఉన్న తన బంధువు స్రవంతి చున్నీ వేసి బయటకు లాగేందుకు ప్రయత్నించినా విఫలమయ్యారు. తరువాత నీటిలో గల్లంతయ్యారని బంధువులు తెలిపారు. ఈ మేరకు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



వెంకటాచారి

## సంక్షిప్త సమాచారం

**క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది...**

**మిర్యాలగూడ గ్రామీణం:** పండగ, ప్రత్యేక దినాల్లో గ్రామాల్లో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ లాంటి క్రీడా పోటీల ద్వారా గ్రామాలు, యువకుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని రామాలయ కమిటీ ఛైర్మన్, దాత సాతునూరి వెంకటేశ్వర్లు, నాయకులు అన్నారు. మండల పరిధిలోని చిల్లాపురం గ్రామంలో దసరాను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ఆయన కప్పులను నాయకులతో కలసి శనివారం అందజేసి మాట్లాడారు. శ్రీనివాస్, కృష్ణంరాజు, గోవిందరాజు, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఆర్థికసాయం.. నిడమనూరు:** మండలంలోని ముకుందాపురానికి చెందిన షేక్ కబీర్ గత నెల 15న నల్గొండ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కబీర్‌కు భార్య పిల్లలు ఉన్నారు. వారి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న నూకల వేణుగోపాల్‌రెడ్డి అండగా నిలిచారు. ఆ కుటుంబానికి వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం రూ.ఇరవై ఐదు వేలు ఆర్థికసాయం చేశారు. వారి పిల్లల చదువుకు అండగా ఉండటంతో పాటు సొంత ఇల్లు కూడా కట్టిస్తానని హామీ ఇచ్చారు.

**విద్యుదాఘాతంతో కోడె మృతి.. గుర్రంపోడు:** గుర్రంపోడు మండలం తానేదార్‌పల్లిలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్తు నియంత్రిక తగిలి విద్యుదాఘాతంతో పశువు మృతి చెందింది. గన్నెబోయిన సత్తయ్యకు చెందిన కోడె ఎర్త్ వైరుకు తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పశువు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని వారు వెల్లడించారు.